క్లుప్తంగా

పెట్రోల్ బంకులో తనిఖీలు



పెట్రోల్ బంకులో తనిఖీలు నిర్వహిస్తున్న అధికారులు

కాళ్ల: స్థానిక హెచ్‌పీ పెట్రోల్ బంకులో జిల్లా అధికారులు మంగళవారం తనిఖీలు చేశారు. సోమవారం పెట్రోల్ బంక్‌లో జరిగిన మోసాలపై వినియోగదారులు తహసీల్దార్‌కు ఫిర్యాదు చేశారు. దీంతో జిల్లా అధికారులు స్పందించి, లీగల్ మెట్రాలజీ అసిస్టెంట్ కంట్రోలర్ వివి నాగరాజారావు, ఏఎస్ఓ ఎం.రవి శంకర్ లు బంకులోని రికార్డులను, పెట్రోల్ నాణ్యతను తదితర అంశాలను క్షుణ్ణంగా క్షేత్ర స్థాయిలో పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ హెచ్‌పీ బంకులో రికార్డులతో పాటు అన్ని అంశాలను క్షుణ్ణంగా పరిశీలించామని తెలిపారు. ఈ నివేదికను జిల్లా అధికారులకు సమర్పిస్తామని పేర్కొన్నారు. వీరి వెంట ఆర్ఐ లక్ష్మీకిరణ్, వీఆర్వో శివనాగరాజు ఉన్నారు.

స్వయంకృషి- 2 ఆటో యూనియన్ కార్యవర్గం ఎన్నిక



భీమవరం స్వయంకృషి- 2 ఆటో యూనియన్ నూతన కార్యవర్గం

భీమవరం: పట్టణంలోని స్వయంకృషి- 2 ఆటో యూనియన్ నూతన కార్యవర్గ ఎన్నికలు మంగళవారం ఉత్కంఠభరితంగా జరిగాయి. స్థానిక నరసయ్య అగ్రహారం కుముదవల్లి రోడ్డులో యూనియన్ ఎన్నికలు బ్యాలెట్ పద్ధతిలో నిర్వహించడం విశేషం. ఈ ఎన్నికల్లో అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులుగా పాలవలస జగన్మోహనరావు, ఆకుమర్తి ప్రసాద్, ఉపాధ్యక్షుడిగా బస్వా కృష్ణ, సహాయ కార్యదర్శిగా కొండేటి డేవిడ్‌రాజు ఎన్నికయ్యారు. నూతన అధ్యక్షుడు జగన్మోహనరావు మాట్లాడుతూ యూనియన్ అభివృద్ధికి, సభ్యుల సంక్షేమానికి అహర్నిశలు కృషి చేస్తానని తెలిపారు.

యూనియన్ బ్యాంక్ సాయం



వాటర్ డిస్పెన్సరీ అందచేస్తున్న యూనియన్ బ్యాంక్ అధికారులు

భీమవరం (ప్రకాశంచౌక్): అంబేడ్కర్ జయంతి సందర్భంగా భీమవరం యూనియన్ బ్యాంకు రీజినల్ ఆఫీస్ వారి ఆర్థిక సహాయం తో సాంఘిక సంక్షేమ శాఖ బాలికల వసతి గృహానికి 10 సీలింగ్ ఫ్యాన్స్, వాటర్ డిస్పెన్సెసర్ యూనియన్ బ్యాంకు రీజినల్ హెడ్ పి. సంగీత కుమారి మంగళవారం అందజేశారు. కార్యక్రమంలో బ్యాంకు డిప్యూటీ రీజినల్ హెడ్ సత్యనారాయణ, లీడ్ బ్యాంకు మేనేజర్ నాగేంద్ర ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

మైక్రో ఫిల్టర్ పనులకు శంకుస్థాపన



మైక్రో ఫిల్టర్స్ నిర్మాణానికి శంకుస్థాపన చేస్తున్న సర్పంచ్ జానకీశ్రీనివాస్

ఉండి: గ్రామంలో తాగునీటి సమస్యకు పరిష్కారం దొరికొందని గ్రామ సర్పంచ్ కోశబోయిన జానకీ శ్రీనివాస్ అన్నారు. మంగళవారం కలిసిపూడిలో మైక్రో ఫిల్టర్ నిర్మాణానికి ఆమె శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఎంపీపీ నిధులు రూ.2.5 లక్షలు, గ్రామ పంచాయితీ నిధులు రూ.2.5 లక్షలతో నిర్మాణం చేపట్టినట్లు ఆమె తెలిపారు. కార్యక్రమంలో కేశబోయిన శ్రీనివాస్, ఎంపీటీసీ సభ్యుడు దండేటి రామలింగేశ్వరరావు, ఉపసర్పంచ్ చంటిరాజు తదితరులు పాల్గొన్నారు.

అంబేడ్కర్ మండపం ప్రారంభం



కోరుకొల్లులో అంబేడ్కర్ మండపాన్ని ప్రారంభిస్తున్న దృశ్యం

పాలకోడేరు: భారతరత్న డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ జయంతి సందర్భంగా నూతనంగా నిర్మించిన అంబేడ్కర్ మండపాన్ని గ్రామ సర్పంచ్ మంతెన భారతి మంగళవారం ప్రారంభించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా మంతెన వెంకట ప్రహ్లాదరాజు ఛారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ మంతెన యోగీంద్రబాబు అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు.ఉప సర్పంచ్ సీహెచ్ఎస్ రామాంజనేయరాజు, సంబలదేవి చంటి తదితరులు పాల్గొన్నారు.

పోషకాహారంతోనే ఆరోగ్య పరిరక్షణ



ఉండి: పాందువ్వలో గర్భిణులతో మాట్లాడుతున్న అధికారులు



వీరవాసరం: రాయకుదురులో పోషణ్ పక్వాడా నిర్వహిస్తున్న దృశ్యం



కాళ్ల: అంగన్‌వాడీ కేంద్రంలో మాట్లాడుతున్న అధికారులు

ఉండి: పోషకాహారంతోనే గర్భిణి, గర్భంలోని శిశువు నిండు ఆరోగ్యంతో ఉంటారని ఐటీసీడీఎస్ ఆకివీడు ప్రాజెక్టు అధికారి వాణీవిజయరత్నం, కేవీకే హోంసైన్స్ శాస్త్రవేత్త డాక్టర్ దెబోరా మెస్సియానా అన్నారు. మంగళవారం పాందువ్వ అంగన్‌వాడీ కేంద్రంలో పోషణ్ పక్వాడా కార్యక్రమంలో భాగంగా పోషణ్ ట్రాకర్ యాప్‌లో గర్భిణిల పేర్లు నమోదు చేసే కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వాణీ విజయరత్నం మాట్లాడుతూ గర్భస్థ సమయంలో వైద్యులు, ఐసీడీఎస్ అధికారుల సూచనల మేరకు అంగన్‌వాడీల ద్వారా ఉచితంగా అందించే పోషకాహారాన్ని తప్పకుండా వాడుకోవాలని సూచించారు. తల్లి తీసుకునే పోషకాహారం గర్భంలోని శిశువుకు కూడా అందుతుందని, కాబట్టి ఇద్దరూ ఆరోగ్యంగా ఉంటారని అన్నారు. సమృద్ధిగా పోషకాహారం తీసుకోవడం వల్ల బాల్యంలో వచ్చే రోగాలు, బాలింతగా వచ్చే రోగాలు రాకుండా ఉంటాయని అన్నారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్ మేరీ, అంగన్‌వాడీ కార్యకర్తలు డి.సత్యవేణి, ఎస్.అనురాధ తదితరులు పాల్గొన్నారు.

రాయకుదురులో

వీరవాసరం: పోషణ్ పక్వాడా కార్యక్రమంలో భాగంగా రాయకుదురు సెక్టార్ తోలేరు గ్రామంలో మంగళవారం అవగాహన సదస్సు నిర్వహించారు.ఈ సందర్భంగా ఎంపీపీ వి.దుర్గాభవాని, సీడీపీఓ టీకేవీ లక్ష్మీకాంతం తల్లి పాల విశిష్టత, అనుబంధ పోషకాహారం ఆహారంలో వైవిధ్యం వంటి అంశబూలపై అవగాహన కల్పించారు. అంగన్‌వాడీ కార్యకర్తలు నిర్మల, భవాని ,దేవి, రమణ, బీబీ,వెంకట నర్సమ్మ తదితరులు వివిధ పోషక విలువలు కలిగిన ఆహార పదార్థాలు ను తయారు జేసి కూరగాయలు, పండ్లు తో ఏర్పాటు చేసిన పౌష్టికాహార ప్రదర్శన విశేషంగా ఆకట్టుకున్నది. కార్యక్రమంలో సర్పంచ్ వీవీ లీలా కృష్ణ , ఏఎన్ఎం సరస్వతీ తదితరులు పాల్గొన్నారు.

కాళ్లలో...

కాళ్ల: సీడీఎస్ ఆకివీడు ప్రాజెక్ట్ ఆధ్వర్యంలో కాళ్ల అంగన్‌వాడీ కేంద్రంలో మంగళవారం పోషణ్ పక్వాడా పక్షోత్సవాలు నిర్వహించారు. ఈ సందర్భంగా గర్భిణులు, పిల్లలు తీసుకోవాల్సిన పోషకాల గురించి, ఆకుకూరల ప్రాముఖ్యత గురించి వివరించారు. బిడ్డ పుట్టిన ఆరు నెలల తర్వాత గుజ్జుగా చేసిన పప్పుతో ఆహారాన్ని పెట్టాలని వారు వివరించారు. అలాగే వివిధ అంశాలపై గర్భిణులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో తహసీల్దార్ జి.సుందర్ సింగ్, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ సీహెచ్ హేమలత తదితరులు పాల్గొన్నారు.

లలిత కళలతోనే సామాజిక చైతన్యం

భీమవరం (ప్రకాశంచౌక్): లలిత కళలతోనే సామాజిక చైతన్యమని, సృష్టిలో 64 కళలున్నాయని, లియొనార్డో డా విన్సీ చిత్రకారునిగా ప్రపంచ గుర్తింపు పొందారని ఆదిలక్ష్మి రజకుల సంఘం కమ్యూనిటీ హాల్ అధ్యక్షులు కొత్తపల్లి వెంకటేశ్వర రావు, లయన్స్ క్లబ్ సీనియర్ నాయకులు నందమూరి రాజేష్ అన్నారు. శ్రీవిజ్ఞానవేదిక అధ్వర్యంలో ఆదిలక్ష్మి రజకుల సంఘం కమ్యూనిటీ హాల్లో ప్రపంచ కళల దినోత్సవాన్ని పురస్కరించుకుని పలువురు కళాకారులను, చిత్రకారులను సత్కరించారు. ఈ సందర్భంగా అరసవల్లి చారిటబుల్ ట్రస్ట్ అధ్యక్షులు అరసవల్లి సుబ్రమణ్యం, నిర్వాహకులు చెరుకువాడ రంగసాయి మాట్లాడుతూ భీమవరంలో చిత్రకళ రంగంలో పేరుగాంచిన అంకల వెంకట సుబ్బారావు, అడవి బాపిరాజు, రాజా రవి వర్మ లు చిరస్మరణీయులని, 600 ఏళ్ల నాడే కళా రంగానికి రచన రంగానికి సాంకేతిక రంగానికి లియొనార్డో డా విన్సీ చేసిన సేవలు అద్వితీయమని అన్నారు. అనంతరం చిత్రకళ రంగం, నాటక రంగం, నాటక సంస్థలకు సంబంధించిన పరిమి రామకృష్ణ, పొన్నా రంగారావు, గ్రంధి నరసింహ మూర్తి, ఏ రాజేష్, జవ్వాది శ్రీనివాస్, ఏం సీతారామ ప్రసాద్, ఎస్ కే చాన్ బాషా లను సత్కరించారు.

అప్రమత్తతతో ప్రమాదాలు దూరం



ఆకివీడు: అగ్నిమాపక వారోత్సవాల్లో భాగంగా కరపత్రాలను పంపిణీ చేస్తున్న దృశ్యం



భీమవరం: అగ్నిమాపక వారోత్సవాల్లో ప్రజలకు అవగాహన కల్పిస్తున్న దృశ్యం

ఆకివీడు: అప్రమత్తతతో ప్రమాదాలను అరికట్టాలని స్థానిక అగ్నిమాపక అధికారి నాగేశ్వర రావు చెప్పారు. అగ్నిమాపక వారోత్సవాల రెండో రోజు మంగళవారం కరపత్రాలను స్థానిక ప్రధాన సెంటర్లలో పంపిణీ చేశారు. ఈ సందర్భంగా స్థానిక అగ్నిమాపక అధికారి నాగేశ్వర రావు మాట్లాడుతూ విపత్తులను ఎదుర్కొనేందుకు అగ్నిమాపక వాహనం సిద్ధంగా ఉందన్నారు. అజాగ్రత్తల వల్లే ప్రమాదాలు సంభవిస్తున్నాయని చెప్పారు. ఆస్తి నష్టం, ప్రాణ నష్టం వాటిల్లకుండా సకాలంలో ప్రమాదాలను తెలియజేయాలని విజ్ఞప్తి చేశారు. స్థానిక గుమ్ములూరు సెంటర్, బస్‌స్టాండ్ సెంటర్, ఎస్‌టర్నింగ్, ప్రధాన సెంటర్, రైల్వే స్టేషన్, తదితర ప్రాంతాల్లో కరపత్రాలను పంపిణీ చేశారు.

అగ్నిప్రమాదాలపై అవగాహన ర్యాలీ

భీమవరం: అగ్నిమాపక వారోత్సవాల్లో భాగంగా మంగళవారం భీమవరంలో అగ్నిమాపక వాహనాలతో ర్యాలీ నిర్వహించారు. పట్టణంలోని రైల్వే స్టేషన్, బస్టాండ్, సినిమా హాల్స్, షాపింగ్ మాల్స్, శివారుప్రాంతాల్లో జిల్లా అగ్నిమాపకాధికారి బి.శ్రీనివాసరావు, సహాయ జిల్లా అగ్నిమాపక అధికారి సీహెచ్ సూర్యప్రకాశరావు, అగ్నిమాపక కేంద్రం సిబ్బంది ప్రజలకు అగ్నిప్రమాదాలపై అవగాహన కల్పించారు. అలాగే అగ్నిప్రమాదాలు సంభవించినపుడు ఎలా నివారించాలనే విషయాలను ప్రదర్శన ద్వారా వివరించారు.

యూటీఎఫ్ కృషి అభినందనీయం



కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న అధికారులు

కాళ్ల: ప్రభుత్వ పాఠశాలల బలోపేతం కోసం యుటీఎఫ్ చేస్తున్న కృషి అభినందనీయమని జిల్లా విద్యాశాఖ అధికారి వినఎస్ఎస్ఎల్ నారాయణ అన్నారు. మండలంలోని పెదఅమిరం మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల (స్పెషల్) యుటీఎఫ్ కాళ్ల మండల శాఖ ఆధ్వర్యంలో మంగళవారం ప్రత్యేక కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా మండలంలోని అన్ని గ్రామాలకు ఆటో ద్వారా మైక్ సహాయంతో ప్రచార కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించారు. ప్రభుత్వ పాఠశాలల్లో ఉన్న చక్కని సౌకర్యాలు విద్యార్థులకు ఇస్తున్న నాణ్యమైన కిట్‌తో పాటు అనుభవం కలిగిన ఉపాధ్యాయుల గురించి తల్లిదండ్రులకు వివరించి వారి పిల్లలు ప్రభుత్వ పాఠశాలలో చేరేలా ప్రయత్నించాలని కోరారు. యుటీఎఫ్ జిల్లా అధ్యక్షులు పీఎస్ విజయరామరాజు, డివైఈఓ ఎన్.రమేష్, ఎంఈఓలు ఎ.రవీంద్ర, వి.వెంకటేశ్వరరావు, సర్పంచ్ డి.సోమేశ్వరరావు పాల్గొన్నారు.

డ్రెయినేజ్ పనుల పరిశీలన



డ్రెయినేజీ పనులు పరిశీలిస్తున్న కమిషనర్

నరసాపురం:పట్టణంలో అవసరమైనచోట్ల డ్రెయినేజీ పూడికతీత పనులు చేయాలని మున్సిపల్ కమిషనర్ ఎం.అంజయ్య శానిటరీ అధికారులను ఆదేశించారు. మంగళవారం కమిషనర్ పట్టణంలో పలు ప్రాంతాల్లో జరుగుతున్న డ్రెయినేజీ శుభ్రం చేసే పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా కమిషనర్ శానటరీ అధికారులు, సిబ్బందికి పలు సూచనలు చేశారు. వేసవి దృష్ట్యా ప్రధాన డ్రెయిన్స్‌లో సిల్ట్ తీసే పనులు చేయాలి ఉందన్నారు. ఈ నేపథ్యంలో అన్ని డ్రెయిన్స్‌ను శుభ్రం చేయాలని చెప్పారు. పనుల్లో ఎలాంటి లోపాలు లేకుండా చూడాలని ఆదేశించారు.

ఆవులు, దూడలను కట్టడి చేసుకోవాలి

పట్టణంలో పలు వీధుల్లో తిరుగుతున్న ఆవులు, దూడలను యజమానులు కట్టడి చేసుకోవాలని కమిషనర్ సూచించారు. రోడ్లపై ఆవులు, గేదెలు, దూడలు తిరుగుతున్నాయని ఇబ్బందులు పడుతున్నామని ప్రజల నుంచి పెద్ద సంఖ్యలో ఫిర్యాదులు వస్తున్నాయని చెప్పారు. ఆవులు, దూడలు రోడ్లపై తిరిగితే వాటిని స్వాధీనం చేసుకుని అందుబాటులో ఉన్న గో-సంరక్షణ శాలలకు తరలిస్తామని అన్నారు. యజమానులకు అపరాధ రుసుములు విధిస్తామని హెచ్చరించారు.

త్యాగమూర్తుల జీవితాలు ఆదర్శం కావాలి



వీవీ గిరి ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో అంబేడ్కర్, పూలే చిత్రపటాల వద్ద నివాళులర్పిస్తున్న ప్రిన్సిపాల్ కె.సుజాత

ఆకివీడు: త్యాగమూర్తుల జీవితాలు నేటి యువతకు ఆదర్శంగా తీసుకోవాలని ప్రిన్సిపాల్ డాక్టర్ కె.సుజాత పిలుపునిచ్చారు. మండలంలోని దుంపగడప గ్రామంలోని వీవీ గిరి ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో బాబూ జగజ్జీవన్‌రామ్, జ్యోతిరావ్ పూలే, డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ జయంతి కార్యక్రమన్ని మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా వారి చిత్రపటాలకు పూలమాలవేసి నివాళులర్పించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ మార్పు కోసం, సమాజంలో పేరుకుపోయిన రుగ్మతల్ని పారదోలేందుకు, స్త్రీ జాతికి విద్య కోసం, దేశ స్వాతంత్ర్యం కోసం అలుపెరుగని పోరాటాలుచేశారని చెప్పారు. కార్యక్రమంలో అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ప్రభుత్వ జూనియర్ కళాశాల పేరు మార్పు

పాలకొల్లు సెంట్రల్: స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలకు స్వాతంత్ర సమరయోధుడు, విద్యా దాత అద్దేపల్లి సత్యనారాయణమూర్తి ప్రభుత్వ జూనియర్ కళాశాలగా నామకరణం చేశార. పాలకొల్లు పట్టణానికి విద్యాదాత అయిన అద్దేపల్లి సత్యనారాయణ మూర్తి 1968లో ప్రభుత్వ కళాశాల నిమిత్తం డొనేషన్ ఇవ్వగా నాటి నుండి ఏఎస్ఎన్ఎం కళాశాలగా పిలవబడుతుంది. 1996లో ఇంటర్, డిగ్రీ కళాశాలలను విడదీయగా డిగ్రీ కళాశాలకు మాత్రమే అద్దేపల్లి సత్యనారాయణమూర్తి పేరున కొనసాగుతుంది. కానీ గత 29 ఏళ్లగా జూనియర్ కళాశాలకు మాత్రం ప్రభుత్వ జూనియర్ కళాశాలగా మాత్రమే కొనసాగుతూ వస్తుంది. అప్పటి నుంచి కళాశాల పేరు మార్పు కోసం కళాశాల అధ్యాపక బృందం ఎన్నో ప్రయత్నాలు చేస్తూ ఉన్నారు. అయితే మార్చి 4న ప్రభుత్వ జూనియర్ కళాశాలకు అద్దేపల్లి సత్యనారాయణమూర్తి ప్రభుత్వ జూనియర్ కళాశాలగా నామకరణం చేస్తున్నట్లు జీఓ వచ్చింది. జీవో వచ్చే సమయానికి ఇంటర్మీడియట్ పరీక్షలు జరుగుతున్నాయని అనంతరం పేపర్ వాల్యూషన్‌కు అధ్యాపకులు వెళ్లడం వల్ల పేరు వెల్లడించడం ఆలస్యమైనట్లు కళాశాల అధ్యాపకులు తెలిపారు. ఈ మమేరకు కళాశాల ప్రిన్సిపాల్ వీకే మల్లేశ్వరరావు మంత్రి నిమ్మల రామానాయుడికి కృతజ్ఞతలు తెలిపారు.

నేడు ఆరు గ్రామాల్లో విద్యుత్ సరఫరా నిలిపివేత

భీమవరం అర్బన్: మండలంలోని రాయలం విద్యుత్ ఉపకేంద్రం పరిధిలో అనాకోడేరు 11 కేవీ ఫీడర్‌పై బుధవారం చెట్లు, కొమ్మలు తొలగించుట, వార్షిక మరమ్మత్తులు నిమ్మిత్తం పలు గ్రామాలలో విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు ట్రాన్స్‌కో ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ ఎన్. వెంకటేశ్వరరావు తెలిపారు. ఈ మేరకు మంగళవారం ఆయన ఓ ప్రకటన విడుదల చేశారు. గొర్లమూడి, కొమరాడ, డేగాపురం, అనాకోడేరు, తుమ్మగొప్పు, ఈలంపూడి గ్రామాలతో పాటు అనాకోడేరు, కొమరాడ ఇండస్ట్రీయల్ సర్వీసులకు, ఆక్వా చెరువులకు ఉదయం 7 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు విద్యుత్ సరఫరా నిలివేస్తున్నామని విద్యుత్ వినియోగదారులు సహకరించాలని కోరారు.

పీ-4 అమలుకు 950 సీసీ కెమెరాల ఏర్పాటు

ఆకివీడు: పీ-4 అమలుకు ఉండి నియోజకవర్గంలో 950 సీసీ కెమెరాలు ఏర్పాట్లుకు దాతలు ముందుకు వచ్చారని డిప్యూటీ స్పీకర్ కె.రఘురామకృష్ణంరాజు చెప్పారు. స్థానిక సర్కిల్ పోలీస్ కార్యాలయంలో మంగళవారం పీ-4 అమలుపై సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నేరరహిత నియోజకవర్గంగా తయారు చేయాలనే లక్ష్యంతో రూ. 3 కోట్ల వ్యయంతో సీసీ కెమెరాలు ఏర్పాటు చేస్తున్నామన్నారు. కార్యక్రమలో ఏపీఐఐసీ చైర్మన్ మంతెన రామరాజు, ఐజీ అశోక్ కుమార్, కలెక్టర్ చదలవాడ నాగరాణి, ఎస్పీ నయీం అస్మి తదితరులు పాల్గొన్నారు.

మున్సిపల్ కార్మికుల సమస్యలు పరిష్కరించాలి



మున్సిపల్ కార్యాలయం వద్ద నిరసన తెలుపుతున్న కార్మికులు

తణుకు అర్బన్: చనిపోయిన, ఆరోగ్యం బాగోని మున్సిపల్ కార్మికుల స్థానంలో వారి పిల్లలకు ఉద్యోగాలు ఇవ్వాలని సీఐటీయూ మండల అధ్యక్షుడు ఎస్. ఆదినారాయణ బాబు, కార్యదర్శి గుబ్బల గోపి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మంగళవారం స్థానిక మునిసిపల్ కార్యాలయం వద్ద సీఐటీయూ ఆధ్వర్యంలో మున్సిపల్ కార్మికులు నిరసన తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రిటైర్‌మెంట్ బెనిఫిట్స్ 62 సంవత్సరాలకు పెంచాలని, గ్రాడ్యూటీ ఇవ్వాలని కోరారు. పెరుగుతున్న ధరలకు అనుగుణంగా వేతనాలు లేక కార్మికులు తీవ్రంగా ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు.సీఐటీయూ నాయకులు ఆర్ట్టి కృష్ణబాబు, అనంతలక్ష్మి, రాణి, మందులయ్య, రమేష్, జ్యోతిబాబు, నాగేంద్ర కుమార్, రాజమ్మ, సోంపద్మ, గంగాధర్, సురేష్, లోవరాజు, రమణ, రాజేశ్వరి, కృష్ణారావు, కుసుమ, శ్రీను, నాని, శ్రీరాములు పాల్గొన్నారు.

తారుమారైన వినూత్న ప్రయోగం

- విఫలమైన వీధి కుక్కలను తరిమే యత్నం



ఒక ఆసుపత్రి వద్ద ఉన్న ఎర్ర రంగు బాటిళ్లు, అక్కడే తిష్ట వేసిన కుక్క

తాడేపల్లిగూడెం (టీఓసీ): వీధి కుక్కలను తరమడానికి ప్రయోగించిన వినూత్న ప్రయోగం విఫలమైంది. వివరాల్లోకి వెళితే వీధి కుక్కలు రాకుండా ఉండేందుకు ఎర్ర రంగు కలిపిన నీటి బాటిల్స్‌ను ఇళ్ల బయట, కొన్ని ఆసుపత్రులు గేట్ల వద్ద ప్రజలు ఉంచుతున్నారు. ఈ బాటిళ్లను ఎందుకు ఉపయోగిస్తున్నారో తెలియక జనం తికమకపడుతున్నారు. అయితే వీధి కుక్కలను తరిమికొట్టేందుకు కొంత మంది ప్రజలు ఈ ఎర్రటి సీసాలను ఉపయోగిస్తున్నట్లు తెలిసింది. ఈ ఎరుపు రంగు కుక్కల కళ్లకు చికాకును తెప్పిస్తాయని, దీంతో అవి దూరంగా ఉంటాయని, వీధి కుక్కలు బెడద తగ్గుతుందని భావించారు. అందుకు భిన్నంగా ఆ బాటిళ్ల వద్దకు వచ్చి కుక్కలు తిష్టవేయడం విశేషం. ఎర్రరంగు బాటిళ్లను ఏర్పాటు చేసిన వారిని వివరాలు అడుగగా కుక్కలను తరిమేందుకు ఈ ఎర్ర రంగు బాటిళ్లను ఇళ్ల బయట ఉంచుతున్నారని, తాము కూడా ఆ విధంగా చేశామని, కుక్కలు ఎర్ర రంగు బాటిళ్లకు ఏ మాత్రం బెదరడం లేదని, రోజూ చాలా కుక్కలు వచ్చి పోతున్నాయని వాపోయారు.

39 మంది వృద్ధులకు వైద్య సేవలు

తణుకు అర్బన్: సజ్జాపురం సీనియర్ సిటిజన్స్ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో మంగళవారం వృద్ధులకు ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. స్థానిక రాష్ట్రపతి రోడ్డులోని సంఘ కార్యాలయంలో నిర్వహించిన వైద్య శిబిరంలో సీనియర్ వైద్యుడు డాక్టర్ భూపతిరాజు రమేష్‌చంద్రబాబు 39 మంది వృద్ధులకు వైద్యసేవలందించారు. శిబిరానికి హాజరైన వృద్ధులకు సుగర్, బీపీ పరీక్షలు నిర్వహించి పేద వృద్ధు లకు ఉచితంగా మందులు పంపిణీ చేసినట్లు సంఘం జిల్లా అధ్యక్షుడు అడ్డాల సత్యనారాయణ తెలిపారు. తణుకు శాఖ అసోసియేషన్ అధ్యక్షుడు ఈదర ప్రసాదరావు, కార్యదర్శి కోసూరి గాంధీ, ఉపాధ్యక్షు ద్వారంపూడి బాపిరెడ్డి, సభ్యులు మద్దా అలివేలు మంగమ్మ, ఇవటూరి లక్ష్మణరావు, చేబ్రోలు సాధు తదితరులు పాల్గొన్నారు.

రేపు ఆర్ఆర్‌డీఎస్ కళాశాలలో మినీ ప్లేస్‌మెంట్ డ్రైవ్

భీమవరం: రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ, నేషనల్ కెరీర్ సర్వీస్ ఆధ్వర్యంలో భీమవరం స్థానిక అర్ఆర్‌డీఎస్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో గురువారం మినీ ప్లేస్‌మెంట్ డ్రైవ్ నిర్వహించనున్నట్లు జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి పి.లోకమాన్ తెలిపారు. ఈ మేరకు మంగళవారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. ప్లేస్మెంట్ డ్రైవ్‌లో అపోలో ఫార్మసీ, కుశలవ మోటార్స్ ప్రైవేట్ లిమిటెడ్ కంపెనీలలో ఉద్యోగఅవకాశాలు కల్పిస్తారని పేర్కొన్నారు. 18–35 ఏళ్ల వయస్సు ఉన్న పురుష, మహిళా అభ్యర్థులు అర్హులని, ఇతర వివరాలకు 94418 41622 నంబర్‌కు ఫోన్ చేయాలని సూచించారు.

18న సర్వోదయ ఆవిర్భావ దినోత్సవం

భీమవరం: సర్వోదయ సమ్మేళన ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా ఈనెల 18న ఉంగుటూరు మండలం నాచుగుంట గ్రామంలోని సర్వోదయ స్థూపం వద్ద వివిధ కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు సర్వోదయ మండలి జిల్లా కార్యదర్శి ఇందుకూరి ప్రసాదరాజు మంగళవారం చెప్పారు. సర్వమత ప్రార్థనలు, శాంతి ప్రదర్శనలు నిర్వహిస్తామన్నారు. అలాగే సేవాతత్పరులు చర్ల విధుకుమారి, బోయపాటి రామలక్ష్మిలకు సర్వోదయ స్ఫూర్తి అవార్డుల ప్రధానం, సర్వోదయ యువవాహిని కార్యక్రమం ప్రారంభం ఉంటుందని ప్రసాదరాజు వివరించారు.

పర్యావరణాన్ని కాపాడుకోవాలి

భీమవరం(ప్రకాశంచౌక్): ప్లాస్టిక్‌ను నిషేధించి పర్యావరణాన్ని కాపాడుకుందామని ది భీమవరం ట్యాక్సీ ఓనర్స్ హెల్పర్స్ అసోసియేషన్ ఉపాధ్యక్షులు గంధం దుర్గాప్రసాద్, కార్యదర్శి మోటుపల్లి వెంకటరావు అన్నారు. మంగళవారం భీమవరం పురపాలక సంఘం, శ్రీవిజ్ఞానవేదిక ఆధ్వర్యంలో భీమవరం ట్యాక్సీ ఓనర్స్ హెల్పర్స్ అసోసియేషన్ సభ్యులతో ప్లాస్టిక్ నిషేధంపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మా అసోసియేషన్ తరుపున ప్లాస్టిక్ నిషేధంపై ప్రచారం చేస్తామని, ప్లాస్టిక్ మహమ్మారిని తరిమికొడతామని అన్నారు. మున్సిపల్ అసిస్టెంట్ కమిషనర్ సిహెచ్ వెంకటేశ్వరరావు, చెరుకువాడ రంగసాయి ఆధ్వర్యంలో గుడ్డ సంచులను పంపిణీ చేశారు.

నేడు ఉండి మండల పరిషత్ సర్వసభ్య సమావేశం

ఉండి: మండల పరిషత్ సర్వసభ్య సమావేశం బుధవారం ఉదయం 10 గంటలకు ఎంపీపీ ఇందుకూరి శ్రీహరినారాయణరాజు అధ్యక్షతన నిర్వహిస్తున్నట్లు ఎంపీడీఓ ఎస్.రవీంద్ర తెలిపారు. ఈ మేరకు మంగళవారం ఆయన ఓ ప్రకటన విడుదల చేశారు. మండలాభివృద్ధి, అజెండాలోని అంశాలపైనా చర్చిస్తామని పేర్కొన్నారు. సమావేశంలో ప్రజాప్రతినిధులు, అధికారులు తప్పకుండా హాజరు కావాలని ఎంపీడీవో కోరారు.

అంగన్‌వాడీ పోస్టుల భర్తీకి దరఖాస్తుల ఆహ్వానం

ఆకివీడు: మహిళా శిశు సంక్షేమ శాఖ ఆకివీడు ప్రాజెక్టు పరిధిలోని అంగన్‌వాడీ కేంద్రాల్లో ఖాళీగా ఉన్న ఆయా, కార్యకర్త పోస్టులకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ప్రాజెక్టు అధికారి వాణీ విజయరత్నం చెప్పారు. మంగళవారం ఆమె విలేకర్లతో మాట్లాడుతూ విస్సాకోడేరు-6 అంగన్‌వాడీ కార్యకర్త పోస్టుకు ఓసీ అభ్యర్థి నుంచి దరఖాస్తు కోరుతున్నట్లు చెప్పారు. అంగన్‌వాడీ ఆయా పోస్టుకు ఉప్పులూరు-1 (ఓసీ), పెదకాపవరం-2(బీసీ-బీ), అప్పారావుపేట(ఎస్సీ), కోపల్లె-2 (ఈడబ్ల్యూఎస్), ఉప్పులూరు-1(ఈడబ్ల్యూఎస్), బంటుమిల్లి-1 (ఓసీ), గుమ్ములూరు-2 (ఓసీ) ఖాళీలకు దరఖాస్తు చేసుకోవాలని విజ్ఞప్తి చేశారు. ఆయా పోస్టులకు 35 సంవత్సరాల లోపు ఉండి స్థానికులైన వివాహిత మహిళ మాత్రమే అర్హులని తెలిపారు. లబ్ధిదారులు దరఖాస్తులను ఈ నెల 22వ తేదీలోపు ఆకివీడు కార్యాలయంలో అందజేయాలని సూచించారు.

సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కుల అందజేత

భీమవరం: అనారోగ్యం కారణంగా వైద్య ఖర్చులు పెరిగి తీవ్ర ఇబ్బందులు పడుతున్న బాధితుల కు సీఎం రిలీఫ్ ఫండ్, పీఎం రిలీఫ్ ఫండ్ నుంచి వైద్య ఖర్చులకు నిధులను మంజూరు చేస్తున్నట్లు కేంద్ర ఉక్కు, భారీ పరిశ్రమలశాఖ సహాయ మంత్రి భూపతిరాజు శ్రీనివాసవర్మ అన్నారు. మంగళవారం పట్టణంలోని బీజేపీ నరసాపురం పార్లమెంట్ కార్యాలయంలో సీఎం రిలీఫ్ ఫండ్ నుంచి వచ్చిన సుమారు రూ.10 లక్షల చెక్కులను శ్రీనివాసవర్మ 8 మంది బాధితులకు అందజేశారు. కార్యక్రమంలో ఐనంపూడి శ్రీదేవి, నార్ని తాతాజీ పాల్గొన్నారు.